ఆరుతడి పంటలే మేలు

- నీటి యాజమాన్య పద్ధతులు పాటిస్తే దిగుబడి
- రైతులకు అవగాహన కల్పిస్తున్న వ్యవసాయాధికారులు


ఆష్టాలో యాసంగిలో సాగవుతున్న శనగ

లోకేశ్వరం: యాసంగిలో ఆరుతడి పంటలైన శనగ, మొక్కజొన్న, జొన్న, పంటలతోపాటు వివిధ రకాల కూరగాయలు సాగుచేస్తే రైతులు అధిక లాభాలు పొందవచ్చని వ్యవసాయాధికారులు పేర్కొంటున్నారు. యాసంగిలో ఆరుతడి పంటలపై నీటి యాజమాన్య పద్ధతులు పాటిస్తే దిగుబడి సాధించవచ్చని రైతులకు అవగాహన కల్పిస్తున్నారు. రైతులు పొలాల వద్ద ఇంకుడుగుంత నిర్మించుకుంటే అందులో వర్షపు నీరు చేరి నిల్వ ఉంటుందని చెబుతున్నారు.

నీటితడులు అందించాలి

పంటలకు కీలకమైన పూత దశలో పంట నీటిఎద్దడికి గురైతే 50 శాతం కన్నా తక్కువ దిగుబడి వస్తుంది. నీటితడులు లేక దిగుబడి గణనీయంగా తగ్గిపోయే అవకాశం ఉంటుంది. పంటలకు గింజకాయ కట్టే దశలో నీటిని అందించాలి. జొన్న పంటలకు సాధారణంగా 400 నుంచి 660 మి.మీ అవసరం ఉంటుంది. మొక్కజొన్నకు 400–550 మి.మీ నీరు వేరుశనగతోపాటు ఇతర పంటలకు 300–400 మి.మీ నీరు అవసరం. ఇందులో మొక్కలు నాటిన 15–18 రోజుల్లో నీటి తడులు అందించాలి. పంట తీసే సమయంలో కంటే 15 నుంచి 28 రోజుల్లోపు చివరి తడి నీరందించాలి. నీటి పారకంలో ద్వారా కాకుండా మొక్కల మొదట్లో నీరందిస్తే వేర్లకు నీరు త్వరగా చేరుతుంది. యాసంగిలో సాగుచేసే వరి పంటకు నాటు వేసినప్పుడు నుంచి పొట్టదశకు చేరే వరకు నీరు అవసరం ఉంటుంది. రైతులు మూస ధోరణి కాకుండా ఆధునిక పద్ధతిలో పంటలు సాగుచేయాలి. దీంతో అధిక దిగుబడులు పొందుతారు. ఎప్పటికప్పుడు వ్యవసాయాధికారుల సూచనలు, సలహాలు పాటించాలి. నీటి వినియోగాన్ని బట్టి పొదుపుగా వాడితే అధిక దిగుబడి సాధించవచ్చని వారికి వివరిస్తున్నారు.


లోకేశ్వరంలో యాసంగిలో సాగవుతున్న మొక్కజొన్న

కూరగాయల సాగుతో లాభాలు



కూరగాయల సాగుతో అన్నదాతలకు ఎంతో లాభం ఉంటుంది. కూరగాయలను తెంపే సమయంలో మార్కెట్‌లో డిమాండ్ బట్టి సాగుచేస్తే మంచి లాభాలు ఉంటాయి. – ప్రకాశ్, నగర్‌తండా

ఆరుతడి పంటలు పండించాలి

యాసంగిలో వరికి బదులుగా ఆరుతడి పంటలు పండిస్తే రైతులకు మంచి లాభం చేకురుతుంది. ఆరుతడి పంటలతోపాటు కూరగాయల సాగు ద్వారా రైతులకు మేలు జరుగుతుంది. – అంజిప్రసాద్, జిల్లా వ్యవసాయ అధికారి

అల్పాహారం అందించరూ..

- 'పది' విద్యార్థులకు ప్రత్యేక తరగతులు
- ఖాళీ కడుపుతోనే హాజరు
- దాతలు ముందుకు రావాలంటున్న హెచ్‌ఎంలు


చదువుకుంటున్న విద్యార్థులు

లక్ష్మణచాంద: మండలంలోని ప్రభుత్వ పాఠశాలల్లో పదో తరగతి విద్యార్థులకు గతనెలలో ప్రత్యేక తరగతులు ప్రారంభమయ్యాయి. పదిలో వందశాతం ఉత్తీర్ణత సాధించేలా వీరికి ఉపాధ్యాయులు బోధన కార్యక్రమాలు చేపడుతున్నారు. విద్యార్థులు ఖాళీ కడుపుతోనే ఉదయం 7 గంటలకే ఇళ్ల నుంచి బయల్దేరి పాఠశాలలకు వస్తున్నారు. మధ్యాహ్నం వరకు అలాగే ఉండడంతో చదువుపై సరిగ్గా దృష్టి పెట్టలేకపోతున్నారు. మండలంలో మొత్తం 7 ప్రభుత్వ ఉన్నత పాఠశాలలు ఉండగా, మొత్తం 250 మంది విద్యార్థులు విద్యనభ్యసిస్తున్నారు. టెన్త్ విద్యార్థులకు రోజు ఉదయం 8.30 నుంచి 9.30 గంటల వరకు, సాయంత్రం 4.30 నుంచి 5.30 గంటల వరకు సబ్జెక్టుల వారీగా బోధనలు జరుగుతున్నాయి. బోధించిన పాఠ్యాంశాలపై టీచర్లు వారికి సందేహాలు నివృత్తి చేస్తున్నారు. అయితే, బీఆర్‌ఎస్ ప్రభుత్వం గత సంవత్సరం జనవరి నుంచి అల్పాహారాన్ని ప్రారంభించింది. గతనెలలో ప్రత్యేక తరగతులు ప్రారంభం కావడంతో అల్పాహారం అందించలేదు. మరి, నూతన ప్రభుత్వం అల్పాహారం అందిస్తుందో లేదోనని అటు విద్యార్థుల్లో, ఇటు తల్లిదండ్రుల్లో సందేహం వ్యక్తమవుతోంది. దాతలు ముందుకొచ్చి అల్పాహారం అందించాలని ఆయా పాఠశాలల ప్రధానోపాధ్యాయులు కోరుతున్నారు.

ఖాళీ కడుపుతోనే



ప్రత్యేక తరగతుల కోసం పాఠశాలకు వస్తున్నా. మధ్యాహ్నం వరకు ఖాళీ కడుపుతోనే ఉండడంతో ఇబ్బందిగా ఉంది. సరిగ్గా చదువుపై దృష్టి పెట్టలేకపోతున్నా.

రూపిక, విద్యార్థిని, లక్ష్మణచాంద

నడుచుకుంటూ వస్తున్నా



తమ గ్రామం నుంచి లక్ష్మణచాందకు పాఠశాలకు నడుచుకుంటూ వస్తున్నా. వచ్చాక ఇక్కడ అల్పాహారం పెట్టడం లేదు. నూతన ప్రభుత్వం అల్పాహారం అందించేలా చర్యలు చేపట్టాలి.

– ఓం తేజశ్రీ, విద్యార్థిని, చామన్‌పెల్లి

దాతలు ముందుకు రావాలి



టెన్త్ విద్యార్థులకు ఉదయం, సాయంత్రం వేళ అల్పాహారం అందించేందుకు దాతలు ముందుకురావాలి. తమ వంతుగా సాయం చేయాలి.

– రాజునాయక్, హెచ్‌ఎం, లక్ష్మణచాంద

క్లుప్తంగా

'వెడ్మ' గెలుపుతో నెరవేరిన ఆశయం


మాట్లాడుతున్న ఎంపీపీ అలెగ్జాండర్

కడెం: ఖానాపూర్ ఎమ్మెల్యేగా వెడ్మ బొజ్జు గెలవడంతో రాజ్యాంగ నిర్మాత అంబేద్కర్ ఆశయం నెరవేరిందని ఎంపీపీ అలెగ్జాండర్ అన్నారు. మండల కేంద్రంలోని ప్రెస్‌క్లబ్‌లో సోమవారం ఆయన మాట్లాడారు. బీఆర్‌ఎస్ అభ్యర్థి గెలుపు కోసం కేంద్రమాజీ మంత్రి వేణుగోపాలాచారి, ప్రస్తుత ఎమ్మెల్సీ దండె విఠల్, మాజీ ఏపీపీఎస్సీ సభ్యుడు రవీందర్ రావుల ఎత్తుగడలను నియోజవర్గ ప్రజలు చిత్తు చేశారన్నారు. నిరుపేద యువకుడిని ఎమ్మెల్యేగా గెలిపించిన ప్రజలకు కృతజ్ఞతలు తెలిపారు. సమావేశంలో యూత్ కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు సతీశ్‌రెడ్డి, మండల అధ్యక్షుడు మల్లేశ్, మండల మాజీ అధ్యక్షుడు గొళ్ల వెంకటేశ్, నాయకులు ఇందూర్‌నేత, భూమేశ్, వాజీద్‌ఖాన్, ఇస్రూ, చాంద్‌పాషా, భూషణం పాల్గొన్నారు.

విద్యార్థులు ఉన్నతంగా రాణించాలి


సన్మానించిన కళాశాల యాజమాన్యం

భైంసాటౌన్: విద్యార్థులు బాగా చదివి ఉన్నతంగా రాణించాలని గురుకృపా వొకేషనల్ జూనియర్ కళాశాల డైరెక్టర్ డా ముష్కం రామకృష్ణాగౌడ్ అన్నారు. ఖమ్మం ప్రభుత్వ నర్సింగ్ కళాశాలలో బీఎస్సీ నర్సింగ్ సీట్లు పొందిన కళాశాలకు చెందిన విద్యార్థినులు తేజస్విని, పూజితతోపాటు మహబూబ్‌నగర్ ప్రభుత్వ మెడికల్ కళాశాలలో బీఎస్సీ రేడియాలజీ విభాగంలో సీటు పొందిన కె.లతను సోమవారం కళాశాల యాజమాన్యం సన్మానించింది. కార్యక్రమంలో శారద ఎడ్యుకేషనల్ సొసైటీ అధ్యక్షురాలు ముష్కం ప్రసన్నరాణి, కళాశాల ప్రిన్సిపాల్ సాయినాథ్, అధ్యాపకులు ఉన్నారు.

నర్సరీలు పకడ్బందీగా నిర్వహించాలి


లోకేశ్వరంలో నర్సరీని పరిశీలిస్తున్న ఎంపీడీవో సోలమాన్‌రాజ్

లోకేశ్వరం: గ్రామాల్లో నర్సరీలు పకడ్బందీగా నిర్వహించాలని ఎంపీడీవో సోలమాన్‌రాజ్ అన్నారు. మండలంలోని ధర్మోర, పంచగుడి, లోకేశ్వరం, రాజూర గ్రామాల నర్సరీలను సోమవారం ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రతీ నర్సరీలో బెడ్లు తయారు చేసి ప్లాస్టిక్ కవర్లల్లో మట్టిని నింపాలన్నారు. ఆయన వెంట టీఏ శారద, ఎఫ్ఏ శ్రీనివాస్ ఉన్నారు.

కొనుగోలు కేంద్రాల పరిశీలన


ధాన్యం తేమశాతాన్ని పరిశీలిస్తున్న ఏఈవో సురేశ్

కడెం: మండలంలోని లక్ష్మీపూర్, నవబ్‌పేట్ గ్రామాల్లో సోమవారం వరిధాన్యం కొనుగోలు కేంద్రాలను ఏఈవో సురేశ్ పరిశీలించారు. కేంద్రాల్లోకి తీసుకువచ్చే ధాన్యం తప్ప, తాలు లేకుండా చూసుకోవాలన్నారు. అకాల వర్షాలు ఉన్నందున టార్పాలిన్ కవర్లు అందుబాటులో ఉంచుకోవాలన్నారు.

నిజాయతీ చాటిన ఆర్టీసీ డ్రైవర్

నిర్మల్‌టౌన్: బస్సులో ప్రయాణికుడు పోగొట్టుకున్న పర్సును తిరిగి అప్పగించి ఆర్టీసీ డ్రైవర్ నిజాయతీ చాటుకున్నాడు. వివరాలు ఇలా ఉన్నాయి. ప్రయాణికుడు రాజ్‌కుమార్ నిర్మల్ బస్టాండ్ నుంచి సోమవారం హైదరాబాద్ శంషాబాద్ ఎయిర్‌పోర్టుకు వెళ్తున్న బస్సెక్కాడు. ఎయిర్‌పోర్టు చేరుకున్నాక అందరూ దిగి వెళ్లారు. ఈ క్రమంలో డ్రైవర్ అసదుల్లా బస్సులో సీటు చూడగా పర్సు గమనించారు. అందులో రూ.3160 నగదు, రూ.10 విలువ చేసే సెల్‌ఫోన్ ఉంది. ఫోన్‌లో ఉన్న మిస్డ్ కాల్‌కు డ్రైవర్ తిరిగి ఫోన్ చేసి చెప్పాడు. బాధితుడు జేబీఎస్ బస్టాండ్ రావడంతో కంట్రోలర్ పోశెట్టి ఆ పర్సును అప్పగించాడు. ఈ సందర్భంగా డ్రైవర్‌కు కృతజ్ఞతలు తెలిపారు.

నూతన ఎమ్మెల్యేకు అభినందనల వెల్లువ


భైంసాటౌన్: రామారావుపటేల్‌కు పుష్పగుచ్ఛం అందిస్తున్న కార్యకర్తలు

భైంసాటౌన్: భారీ మెజార్టీతో గెలుపొందిన ముథోల్ నూతన ఎమ్మెల్యే పవార్ రామారావుపటేల్‌కు పెద్దఎత్తున అభినందనలు, శుభాకాంక్షలు తెలుపుతున్నారు. పట్టణంలోని ఆయన నివాసంలో సోమవారం నాయకులు, కార్యకర్తలు, అభిమానులతో సందడి నెలకొంది. ఉదయం నుంచే ఆయన ఇంటి వద్దకు చేరుకుని శాలువా, పూలమాలలతో సన్మానించారు.


ముధోల్: ఎమ్మెల్యేను సన్మానిస్తున్న ముధోల్ నాయకులు

ముధోల్: ఎమ్మెల్యేగా ఎన్నికైన రామారావుపటేల్‌ను భైంసాలోని ఆయన స్వగృహంలో బీజేపీ కార్యకర్తలు, నాయకులు సోమవారం సన్మానించి అభినందనలు తెలిపారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ నియోజకవర్గ అభివృద్ధికి తనవంతు కృషి చేస్తానన్నారు. మాజీ జెడ్పీటీసీ లక్ష్మీనర్సాగౌడ్, మాజీ సర్పంచ్ గంట శ్రీనివాస్, నాయకులు తాటివార్ రమేశ్, దశరథ్, నవీన్, అనిల్, గజానంద్ ఉన్నారు.

ఎమ్మెల్యే 'ఏలేటి'ని కలిసిన నాయకులు


ఎమ్మెల్యే మహేశ్వర్‌రెడ్డిని సన్మానిస్తున్న ఎంపీపీ పద్మ

లక్ష్మణచాంద: నిర్మల్ ఎమ్మెల్యేగా గెలుపొందిన ఏలేటి మహేశ్వర్‌రెడ్డిని సోమవారం నిర్మల్‌లోని ఆయన నివాసంలో ఎంపీపీ అడ్వాల పద్మ కలిశారు. ఎమ్మెల్యే దంపతులను సన్మానించారు. లక్ష్మణచాంద సర్పంచ్ ముత్యంరెడ్డి, ఎంపీటీసీ నర్సారెడ్డి, ఉప సర్పంచ్ శ్రీనివాస్, నాయకులు భూపాల్‌రెడ్డి, రాజు, గంగన్న, భీంరెడ్డి, రాజేశ్వర్, దశగౌడ్, చంద్రశేఖర్‌రెడ్డి, అడ్వాల రమేశ్‌లు ఎమ్మెల్యే కలిసి అభినందనలు తెలిపారు.

మహేశ్వర్‌రెడ్డి గెలిచారని అన్నదానం

లక్ష్మణచాంద: నిర్మల్ ఎమ్మెల్యేగా ఏలేటి మహేశ్వర్ రెడ్డి గెలుపొందిన సందర్భంగా చామన్‌పెల్లిలోని రామాలయంలో గ్రామస్తులు సోమవారం అన్నదానం చేపట్టారు. బీజేపీ ఆధ్వర్యంలో సత్యనారాయణ పూజ నిర్వహించి మొక్కు చెల్లించుకున్నారు. స్వామివారికి 101 కొబ్బరికాయ కొట్టారు. నాయకులు వెంకటరెడ్డి న్యాయవాది రమణ, చిన్న మల్లేశ్, సాయన్న, ప్రశాంత్‌రెడ్డి, రమేశ్, నారాయణ, అఖిలేష్, లింగారెడ్డి, సాగర్‌రెడ్డి, అరటి శ్రీనివాస్ పాల్గొన్నారు.


శుభాకాంక్షలు తెలుపుతున్న నాయకులు

దిలావర్‌పూర్: నిర్మల్ ఎమ్మెల్యేగా ఎన్నికైన ఏలేటి మహేశ్వర్‌రెడ్డిని ఆయన నివాసంలో నాయకులు కలిసి అభినందనలు తెలిపారు. జెడ్పీటీసీ మాజీ సభ్యురాలు ఆమ్గోత్ సుజాత మేర్వాన్, నర్సారెడ్డి, జెడ్పీటీసీ రమణారెడ్డి, మండల అధ్యక్షుడు శైలేశ్వర్, దిలావర్‌పూర్ సర్పంచ్ జంగం వీరేశ్ ఉన్నారు.

గ్రామాల శుభ్రత పాటించాలి


మాట్లాడుతున్న ఎంపీడీవో శ్రీనివాస్‌రావు

తానూరు: గ్రామాల శుభ్రత పాటించాలని ఎంపీడీవో శ్రీనివాస్‌రావ్ అన్నారు. మండల పరిషత్ కార్యాలయంలో గ్రామాల పంచాయతీ కార్యదర్శులు, ఉపాధిహామీ సిబ్బందితో సోమవారం నిర్వహించిన సమావేశంలో మాట్లాడారు. పల్లెల్లో మురుగు కాల్వలను సిబ్బంది ఎప్పటికప్పుడు శుభ్రం చేయాలన్నారు. గతంలో జరిగిన ఉపాధిహామీ పనులకు సంబంధించిన రికార్డులు, మాస్టర్‌లను అందుబాటులో ఉంచుకోవాలన్నారు. ఉపాధి పనులపై సామాజిక తనిఖీ బృందాలు మండలానికి రానున్నట్లు తెలిపారు. హరితహారంలో నాటిన మొక్కలు ఎండిపోకుండా చూడాలని సూచించారు. సమావేశంలో ఎంపీవో మోహన్‌సింగ్, పంచాయతీ కార్యదర్శులు, ఉపాధిహామీ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.


భలే భలే..బీర

లోకేశ్వరం: మండలంలోని నగర్‌తండాలో రైతు బీర సాగుతో ఇతరులకు ఆదర్శంగా నిలుస్తున్నాడు. పందిరి సాగు పద్ధతిలో పండిస్తున్నా పంట ఇప్పుడిప్పుడే కోతకు వస్తోంది. రాబడి బాగానే ఉందని అంటున్నాడు. ఆ దారి వెంట వెళ్లేవారు తోటను చూసి మురిసిపోతున్నారు.

లోకేశ్వరం మండలంలో పార్టీల ఓట్లు

లోకేశ్వరం: మండలంలోని 38 పోలింగ్ కేంద్రాల్లో 28,772 ఓటర్లు ఉండగా అసెంబ్లీ ఎన్నికల్లో 24,145 మంది ఓటేశారు. గ్రామాల వారీగా పార్టీలకు వచ్చిన ఓట్ల వివరాలు..

గ్రామాలవారీగా పార్టీలకు వచ్చిన ఓట్లు

గ్రామాలు	బీఆర్‌ఎస్	కాంగ్రెస్	బీజేపీ
పుస్పూర్	741	62	923
సేవాలాల్‌తండా	267	04	118
నర్సింహనగర్	24	07	282
హథ్‌గాం	203	33	220
సాథ్‌గాం	159	49	215
బీలోలి	412	23	267
హావర్గ	164	16	324
మన్మద్	489	98	805
పోట్‌పల్లి	267	102	397
రాజూర	796	64	1087
నగర్	362	85	414
లోకేశ్వరం	584	82	1443
కిష్టాపూర్	87	11	346
బామ్నికే	332	39	315
గడ్‌చాంద	506	51	902
పిప్రి	427	60	639
రాయపూర్‌కాండ్లీ	588	58	552
గొడిసెరా	208	43	524
ధర్మోర	246	33	563
పంచగుడి	276	61	372
వట్టోలి	233	41	546
అబ్దుల్లాపూర్	266	30	740
జోహర్‌పూర్	153	18	128
కన్కపూర్	301	44	601
భాగాపూర్	103	44	170


కుంటాల: అందాకూర్ రోడ్డుపైనే ధాన్యం

కారుమబ్బులతో గుబులు

కుంటాల/ఖానాపూర్: మిచాంగ్ తుఫాను ప్రభావంతో సోమవారం కారు మబ్బులు కమ్ముకున్నాయి. దీంతో వాతావరణం చల్లబడింది. కుంటాల మండలంలోని అందాకూర్, కుంటాల, వెంకూర్ గ్రామాల్లో రైతులు రోడ్లపైనే, ఖానాపూర్ మండలంలోని పలు గ్రామాల్లో ధాన్యం ఆరబెడుతున్నారు. ఎప్పుడు వర్షం కురుస్తుందోనన్న బెంగ వారిలో నెలకొంది.


ఖానాపూర్: దిలావర్‌పూర్‌లో ధాన్యాన్ని ఆరబెడుతున్న రైతు

సన్మానం

కుంటాల: కుంటాల ఇలవేల్పు శ్రీ గజ్జలమ్మ ఆలయ నాలుగవ వార్షికోత్సవం సందర్భంగా సారంగాపూర్ మండలం జామ్ గ్రామానికి చెందిన అల్లాడి కవిత–వెంకటనర్సయ్య దంపతులు ఇటీవల అన్నదానం చేశారు. వీరిని సోమవారం ఆలయ కమిటీ సభ్యులు సన్మానించి గజ్జలమ్మ ప్రతిమ అందజేశారు. ఆలయ కమిటీ సభ్యులు జుట్టు సుధాకర్, కక్కెర ముత్యంరావు, మేసినేని చిన్నన్ రావు తదితరులు పాల్గొన్నారు.

దరఖాస్తుల ఆహ్వానం

కుంటాల: ఓపెన్ టెన్త్, ఇంటర్‌లో అడ్మిషన్ల కోసం దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు కుంటాల ఉన్నత పాఠశాల కోఆర్డినేటర్ వాటోలి ముత్యం, అసిస్టెంట్ కోఆర్డినేటర్ సగ్గం గంగాధర్ ఓ ప్రకటనలో తెలిపారు. ఈనెల 11లోగా అభ్యర్థులు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. వివరాలకు 85558 38196 సెల్‌నంబర్‌లో సంప్రదించాలని కోరారు.

అటెన్షన్ ప్లీజ్ — గుంతలమయంగా రోడ్డు



తానూరు: మండలంలోని మసల్గా నుంచి కళ్యాణి గ్రామానికి ఉన్న తారురోడ్డు గుంతలమయంగా మారింది. దీంతో రాకపోకలు సాగించాలంటే ప్రయాణికులు, వాహనదారులు ఇక్కట్లు పడుతున్నారు. రోడ్డుకు మరమ్మతు చేపట్టేలా అధికారులు చర్యలు తీసుకోవాలని వారు కోరుతున్నారు.

అధికారి: జగదీశ్, పీఆర్ఏఈ, సెల్: 91211 35623

న్యాప్‌కిన్స్ అందజేత

కడెం: మండలంలోని లింగాపూర్ ప్రభుత్వ ఉన్నత పాఠశాలలోని 9,10వ తరగతి విద్యార్థినులకు బీఆర్‌ఎస్వీ ఉమ్మడి జిల్లా మాజీ అధ్యక్షుడు కొప్పుల నరేశ్ సోమవారం న్యాప్‌కిన్స్ అందజేశారు. నాలుగు నెలలకు సరిపడేలా సుమారు రూ.5 వేల విలువ గల న్యాప్‌కిన్స్ అందించినట్లు నరేశ్ తెలిపారు.

తులసి వివాహం

ముథోల్: మండల కేంద్రంలోని శ్రీసరస్వతీ శిశు మందిర్‌లో సోమవారం కార్తీకపౌర్ణమి సప్తమిని పురస్కరించుకొని తులసీ మొక్కలు నాటి పూజలు చేశారు. అనంతరం తులసీ వివాహ వేడుకలు జరిపారు. ఈ సందర్భంగా పాఠశాల విద్యార్థులు దీపాలను వెలిగించారు. ప్రధానాచార్యులు సారథిరాజు, స్వప్నశర్మ, ఆచార్యులు తదితరులు ఉన్నారు.

ప్రకృతివనం పరిశీలన

మామడ: మండలంలోని నల్దుర్తి గ్రామ ప్రకృతివనం, నర్సరీలను సోమవారం డీఎల్‌పీవో రమేశ్ పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సెగ్రిగేషన్ షెడ్ నిర్వహణపై నిర్లక్ష్యం వద్దన్నారు. నర్సరీల్లో మొక్కల సంరక్షణపై దృష్టి పెట్టాలన్నారు. ఆయన వెంట పంచాయతీ కార్యదర్శి రాజేశ్వర్‌రెడ్డి తదితరులు ఉన్నారు.

తాళసప్తాహం ప్రారంభం

కుభీర్: మండల కేంద్రంలోని విఠలేశ్వర మందిరంలో సోమవారం తాళసప్తాహం ప్రారంభమైంది. ఏడు రోజులు కొనసాగి 11న ముగియనుంది. మందిరంలో జరిగే జాతరకు ఏర్పాట్లు చేసినట్లు ఆలయ కమిటీ చైర్మన్ పరుశురాం తెలిపారు. ఈ జాతరకు గ్రామాలతోపాటు మహారాష్ట్రవాసులు పాల్గొంటారని వివరించారు.